సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 26 । మే । 2023



సముద్ర వ్యర్థాలపై సదస్సు
సముద్రంలో వ్యర్థాలను నిర్మూలించే పద్ధతులపై ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 8లో



బేగం.. నాట్యంలో అమేయం..!
వెంపటి సత్యం మాస్టారి శిష్యరికంలో షేక్ కాలేషా బేగం కూచిపూడి నృత్యంలో దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చారు. 8లో



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్
అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫాంపై లిఫ్ట్‌ను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు.

న్యూస్‌రీల్

అన్ని అంశాలకు స్థాయీ సంఘం ఆమోదం


మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. సాయీ సంఘం అజెండాలో 47 అంశాలు, మరో 15 టేబుల్ అంశాలు పొందుపరిచారని, వీటన్నింటికీ ఆమోదం లభించాయని చైర్‌పర్సన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.6.61 కోట్ల పనులకు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు పలు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు డీసీ(రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, సింహాచలం, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు పక్కా ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం: ఏపీపీఎస్సీ శుక్రవారం నిర్వహించనున్న కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డీఆర్వో తన ఛాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ విభాగంలో పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ అధికారి గ్రేడ్-2, వీఆర్ఓ గ్రేడ్-1, హెచ్‌వోడీలు, డైరెక్టరేట్‌లలో కారుణ్య ప్రాతిపదికన నియమితులైన ఉద్యోగులకు ఏపీపీఎస్సీ కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్ష పెదగంట్యాడలోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రంగా జరుగుతుందనీ, 402 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష నాలుగు షిఫ్టులలో జరుగుతుందని, కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా డాక్టర్ నరేష్‌కుమార్



దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి(సీఎంఓహెచ్)గా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ నరేష్ తుని ఏరియా హాస్పటల్లో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్‌పై రెండేళ్ల కాల పరిమితికి జీవీఎంసీలో ప్రధాన వైద్యాధికారిగా విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి అనారోగ్య కారణంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. శాస్త్రి తదుపరి పోస్టింగ్‌కు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, విజయవాడకు రిపోర్టు చేయాలని ఆదేశించింది.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

గోపాలపట్నం : స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరని ఉపరవాణా కమినర్ రాజారత్నం పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో స్కూల్, కళాశాల బస్సులపై ప్రత్యేక డ్రైవ్ పెడుతున్నట్టు చెప్పారు. పాఠశాలలు, కళాశాల బస్సుల డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవముండాలని, 60 ఏళ్లు మించకూడదని తెలిపారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు తప్పనిరిగా చేయించుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 500పైగా స్కూల్, కళాశాల బస్సులకు సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు.

జూన్ 12 నుంచి స్పెషల్ డ్రైవ్
పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిబంధనలు పాటించని వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. జూల్ 12 నుంచి 30 వరకు ఈ డ్రైవ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏ మాత్రం తేడాలున్నా బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వేలిముద్రల ఇక్కట్లకు చెక్

- రేషన్ సరుకుల పంపిణీకి ఐరిస్ పరికరాలు
- వేలిముద్రలు పడక సరుకులు పొందలేకపోతున్న వారికి ఊరట
- జిల్లాలో 311 ఎండీయూ వాహనాలకు పరికరాలు
- వచ్చే నెల నుంచి కొత్త విధానం అమలు


ఐరిస్ పరికరాలు

'సార్.. రేషన్ కార్డు ఉంది.. బండి వస్తున్నప్పుడు వేలి ముద్రపడడం లేదు.. అందుకే రెండు నెలలుగా రేషన్ ఇవ్వడం లేదు. ఏదైనా దారి చూపండి..''
'పనులు చేసి.. చేసి.. నా వేలిముద్రలు అరిగిపోయాయి సర్.. ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లినా మార్పులు జరగడం లేదన్నారు. రేషన్ సరుకులు తీసుకోలేకపోతున్నాను. చాలా ఇబ్బందిగా ఉంది.'
– స్పందనలో పదే పదే వస్తున్న అర్జీలివీ..

వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య ప్రజలకు ఎదురవుతున్న కష్టాలపై దృష్టిసారించి, పరిష్కార మార్గాల్ని అన్వేషించి.. వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా రేషన్‌కార్డు దారుల ఇబ్బందులకు చెక్ చెప్పేలా ఐరిస్ ద్వారా సరకుల పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం చేశారు.

మండలం/జోన్	పంపిణీ చేసిన ఐరిస్ పరికరాలు
ఆనందపురం	20
భీమునిపట్నం	32
పద్మనాభం	16
పెందుర్తి రూరల్	07
గాజువాక(సర్కిల్-3)	37
గోపాలపట్నం(సర్కిల్-1)	38
మహారాణిపేట(సర్కిల్-1,2)	30
ములగాడ(సర్కిల్-3)	16
పెదగంట్యాడ(సర్కిల్-3)	19
పెందుర్తి అర్బన్ (సర్కిల్-1)	21
సీతమ్మధార(సర్కిల్-2)	41
విశాఖ రూరల్(సర్కిల్-2)	34
మొత్తం	311

సాక్షి, విశాఖపట్నం : రేషన్ పంపిణీ విధానంలో మార్పులకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలి ముద్రలు) ఆధారంగా రేషన్ పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయాన్ని తీసుకొంది. లబ్ధిదారులకు ప్రతినెలా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న సమయంలో పలు చోట్ల వేలి ముద్రల సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. ఇంటి పనులు చేసినవాళ్లు, కూలి పనులకు వెళ్లే వాళ్లు, వృద్ధులు.. ఇలా చాలా మందికి వేలి ముద్రల్లో రేఖలు అరిగిపోయాయి. ఆధార్ కార్డు అప్‌డేషన్‌కు వెళ్లే సమయంలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో రేషన్ తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా జిల్లాలో కనీసం ప్రతి నెలా 1500 నుంచి 2 వేల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


ఎండీయూ ఆపరేటర్లకు ఐరిస్ పరికరాలు అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

వచ్చే నెల నుంచి ఐరిస్ ద్వారా రేషన్
బయోమెట్రిక్ వల్ల లబ్ధిదారులు రేషన్ తీసుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటివరకు సరుకుల పంపిణీలో ఉన్న బయోమెట్రిక్ విధానంతో పాటు ఐరిస్ (కంటి గుర్తింపు) విధానం కూడా అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే పౌరసరఫరాలశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే జూన్ నుంచి ఈ రెండు విధానాల్లో రేషన్ పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించిన ఐరిస్ పరికరాలను జిల్లా పౌర సరఫరాల అధికార యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. కలెక్టరేట్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ చేతుల మీదుగా జిల్లా పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లకు అందజేశారు.

ఈపోస్‌తోపాటు ఐరిస్



జిల్లాలో మొత్తం 5,21,435 మంది బియ్యం కార్డుదారులున్నారు. వచ్చే నెల నుంచి ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా.. వేలిముద్ర పడటం లేదన్న ఆలోచన లేకుండా రేషన్ తీసుకోవచ్చు. బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని రేషన్ పంపణీ చేయనున్నాం. ఈ నెల నుంచి గోధుమలు కూడా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– సూర్యప్రకాష్, జిల్లా పౌరసరఫరాల అధికారి

కార్మికులకు వెన్నుదన్నుగా జీవీఎంసీ

- బీమా సొమ్ము చెల్లించేందుకు పాలకవర్గం నిర్ణయం
- ఉద్యోగుల సంక్షేమమే జీవీఎంసీ లక్ష్యం
- 482 పోస్టుల భర్తీకి కసరత్తు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వెల్లడి



దాబాగార్డెన్స్ : జీవీఎంసీలో క్షేత్ర స్థాయిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న శాశ్వత, పొరుగు సేవ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా జీవీఎంసీ కృషి చేస్తోందని కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులను సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తూ మృతి చెందిన లేదా అంగవైకల్యానికి గురైన కార్మికులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులందరికీ జీవిత బీమాతో కూడిన పథకాలు జీవీఎంసీ నిధుల నుంచి అందించేందుకు నగర మేయర్, పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యా లయ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంచే ప్రారంభించిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం (పీఎంఎస్‌బీవై) వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. జీవీఎంసీ క్షేత్రస్థాయిలో మొత్తం 8,050 మంది శాశ్వత, పొరుగు సేవ కార్మికులున్నారు. పీఎంజేజేబీవైకు ఒక్కొక్క కార్మికుడికి రూ.436 (ఏడాది కాలానికి రూ.2లక్షలు వర్తిస్తుంది) వార్షిక బీమా, పీఎంఎస్‌బీవైకు రూ.20 (ఏడాది కాలానికి రూ.2లక్షలు) చొప్పున చెల్లించాలి. మొత్తం బీమ సొమ్ము రూ.36,70,800 జీవీఎంసీ నిధుల నుంచి చెల్లించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు తెల్లటోపీలు
ఎండల తీవ్రత దృష్ట్యా పారిశుధ్య కార్మికులందరికీ తెల్లటోపీలు అందజేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు మండుటెండల్లో పనిచేస్తున్నారని, వారి భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

పారదర్శకంగా పోస్టుల భర్తీ
జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పొరుగుసేవ పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తూ మరణించిన, ఇతర కారణాల చేత ఏర్పడిన 482 ఖాళీలను భర్తీ చేసేందుకు కలెక్టర్, ఆప్కాస్ చైర్మన్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ చెప్పారు. పోస్టుల భర్తీకి కౌన్సిల్ నిర్ణయం తీసుకుందన్నారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని మేయర్ హరి వెంకటకుమారి రూలింగ్ ఇచ్చారన్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పరిశీలన కోసం ఆయా జోనల్ కార్యాలయాలకు పంపడం జరిగిందన్నారు. వీరిలో 77 మంది అభ్యర్థులు మాత్రమే పూర్తి వివరాలు అందజేశారని మిగిలిన వారికి ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించామన్నారు. మిగిలిన వారు అన్ని పత్రాలు జత చేసి జోనల్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఇదిలా ఉండగా 482 పోస్టుల్లో కారుణ్య నియామకాలను భర్తీ చేసిన అనంతరం మిగిలిన పోస్టులకు సంబంధించి ఓ కమిటీ వేసి, నియమ నిబంధనలు మేరకు పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో ఆంధ్రా ఊటీ అరకు వెళ్లే రైల్వే ప్రయాణికుల, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. జూన్ 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ- కిరండూల్(08551) రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో జూన్ 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, జూలై 1వ తేదీలలో బయల్దేరే కిరండూల్-విశాఖ (08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన అవసరం

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం(1902) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం జగనన్నకు చెబుదాం, విద్య, వైద్య, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోయినా, గ్రామ సమస్యలను కూడా ప్రజలు జగనన్నకు చెబుదాం -1902కు ఫోన్ చేసి చెప్పేలా చైతన్యం తేవాలన్నారు. అన్ని బోధనాస్పత్రుల్లో సాయంత్రం ఓపీ నిర్వహించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో సమీక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ సర్వే నిర్వహించగా.. విశాఖ జిల్లా 64 శాతంలో ఉందని, శత శాతం సాధించడానికి కృషి చేస్తామన్నారు. త్వరలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి టెక్నికల్ అంశాలపై అభిప్రాయాలు సేకరించి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎల్‌డీవో పూర్ణిమదేవి, విద్యా, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పరారైన గంజాయి నిందితుడి అరెస్ట్


తిరుమూర్తి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ద్వారకా పోలీస్ స్టేషన్ నుంచి ఇటీవల పరారైన గంజాయి నిందితుల్లో ఒకరిని ఎట్టకేలకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం కుడ్డాలూరు జిల్లా, కిజూహర్ మెయిన్ రోడ్డుకు చెందిన వి.సురేష్, తిరుమూర్తి శనివారం రామాటాకీస్ సమీపంలో ద్వారకానగర్ పోలీసులకు ఏడు కిలోల గంజాయితో పట్టుబడ్డారు. సోమవారం తెల్లవారుజామున విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిద్రలోకి జారుకోవడంతో నిందితులిద్దరూ బేడీలు తీసుకుని పరారైన సంగతి తెలిసిందే. సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి తమిళనాడు వెళ్లారు. బుధవారం రాత్రి తిరుమూర్తిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం నగరానికి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. మరో నిందితుడ్ని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

మబ్బుల ఛత్రం.. మెరుపుల 'వర్షం'





విశాఖ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది... ఉదయమంతా మండుటెండ.. మధ్యాహ్నం మేఘావృతం.. సాయంత్రం కారు మబ్బులు.. కాసేపటికే ఉరుములు.. మెరుపులు..అంతలోనే భారీ వర్షం.. ఇది గురువారం నాటి విశాఖలో వెదర్ రిపోర్ట్. సుమారు గంటన్నరపాటు వర్షం కురిసింది. కాసేపు తెరిపిచ్చింది. మళ్లీ రాత్రి 8 గంటల నుంచి 8.30 గంటల వరకు ఉరుములు,మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. మొత్తానికి నగరం చల్లగా మారింది. ప్రజలంతా ఉపశమనం పొందారు.




పనులపై బయటకు వచ్చిన వారంతా వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగించారు.
- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్లు



ఇగ్నో ప్రవేశాలకు జూన్ 30 గడువు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)-2023లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న కేంద్రం పరిధిలోని ఐదు జిల్లాల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్‌లో ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం జూన్ 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రెండో రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రెండో రోజైన గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 25,853 మంది విద్యార్థులకు 24,955 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 3,530 మందికి గాను 3,266 మంది హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి తెలిపారు.

కానుకలొచ్చేశాయ్!

- స్టాక్ పాయింట్లలో జగనన్న విద్యాకానుకలు
- తరగతుల వారీగా వస్తువుల విభజన
- స్కూళ్లకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు
- బడితెరిచిన రోజునే పంపిణీ
- జిల్లాలో 1.02 లక్షల మందికి ప్రయోజనం


విద్యాకానుక వస్తువుల ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: బడితెరిచిన తొలిరోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో గుర్తించిన స్టాక్ పాయింట్లలో ఇప్పటికే జగనన్న విద్యాకానుక వస్తువులు నిల్వ చేశారు. ఇక్కడ నుంచి స్కూల్ పాయింట్‌కు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని గతేడాది ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 1,01,370 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించగా, ఈ ఏడాది కొత్తగా అడ్మిషన్లు పొందిన వారికి సైతం తొలిరోజునే కానుక పంపిణీ చేసేలా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 1.02 లక్షల మందికి పంపిణీ చేయాలనే ముందస్తు అంచనాతో కానుకలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

కానుకలో 8 రకాల వస్తువులు
ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థి చదువుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని ఉచితంగానే అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విద్యార్థులకు అందించే విద్యాకానుక కిట్‌లో 8 రకాల వస్తువులు ఉంటాయి. మూడు జతల యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఇంగ్లీషు డిక్షనరీ, ఒక బెల్ట్, షూస్, రెండు జతల సాక్స్‌ను బ్యాగులో పెట్టి విద్యార్థులందరికీ జగనన్న కానుక అందజేయనున్నారు.

నాణ్యతపై ముందుగానే తనిఖీ
జిల్లాలోని ఆనందపురం, భీమునిపట్నం, చినగదిలి, గాజువాక, పద్మనాభం, పెదగంట్యాడ, పెందుర్తి మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. విశాఖ అర్బన్‌లో ఎక్కువగా పాఠశాలలు ఉన్నందున ఇక్కడ మూడు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. గాజువాక వడ్లపూడిలో ఉన్న గోదాము నుంచి పాఠ్యపుస్తకాలను స్కూల్‌పాయింట్లకు చేర్చుతున్నారు. నోట్ బుక్స్, బెల్ట్, షూస్, డిక్షనరీ, సాక్స్ , బ్యాగులు స్టాక్ పాయింట్లకు సరఫరా అయ్యాయి. మరో రెండు మూడు రోజుల్లోనే యూనిఫారాలు సరఫరా కానున్నాయి. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులను సీఆర్పీలతో ముందుగానే పరిశీలించారు.


ద్వారకానగర్‌లోని స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన నోట్ పుస్తకాలు

స్కూళ్లకే నేరుగా సరఫరా..
మండల కేంద్రాల్లో ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి జగనన్న విద్యాకానుక కిట్లను నేరుగా స్కూళ్లకు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్టాక్ పాయింట్లలోనే వస్తువులన్నీ బ్యాగులో పెట్టి కిట్ రూపంలో సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసమని సీఆర్పీలను వినియోగిస్తున్నారు. కిట్ తయారీలో భాగంగా విధులు కేటాయించే వారికి రోజుకు రూ.100ల చొప్పున అందించేందుకు నిధులు కేటాయించారు.

సిద్ధం చేస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా విద్యాకానుక కిట్లు సిద్ధం చేస్తున్నాం. ఇంకా యూనిఫారాలు రావాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో స్టాక్ పాయింట్లకు సరఫరా అవుతుందనే సమాచారం వచ్చింది. స్టాక్ పాయింట్లు నుంచి స్కూళ్లకు సరఫరా చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.
– శిరీషారాణి, సీఎంవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

10వ తేదీలోగా ఆస్పత్రులు, ల్యాబ్‌ల నమోదు

మహారాణిపేట: విశాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరపి కేంద్రాలు, డెంటల్ క్లినిక్స్, స్కానింగ్ కేంద్రాలు ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002/2007 ప్రకారం వచ్చే నెల పదో తేదీలోగా నమోదు చేసుకోవాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు https://clinicalesttact.ap.gov.in/ వెబ్‌సైట్‌లో నమోదు కావాలని, స్కానింగ్ కేంద్రాల నమోదు కోసం https:// pepndt.ap.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. ఆస్పత్రులు, నర్సింగ్ హోంలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైద్య ఆరోగ్యశాఖ డీడీగా శ్రీనివాస కుమార్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా సీహెచ్ శ్రీనివాసకుమార్‌ను నియమించారు. ఇంతవరకు ఇక్కడ డీడీగా పనిచేసిన భక్తవత్సల్యను కడప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ కుమార్ కేజీహెచ్‌లో పరిపాలన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

సముద్ర వ్యర్థాలపై సదస్సు

అల్లిపురం: సముద్రంలో వ్యర్థాలను నిర్మూలించే పద్ధతులపై ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం హోటల్ గ్రీన్‌పార్కులో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఏపీ పొల్యూషన్ బోర్డు కార్యదర్శి బి.శ్రీధర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశాఖ పొల్యూషన్ బోర్డు, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రసాదరావు మాట్లాడుతూ సముద్ర వ్యర్థాలు శాశ్వత నిర్మూలన పద్ధతిపై ప్రసంగించారు. చెన్నై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రీజినల్ డైరెక్టర్ హోసోర్ దేవయ్య వరలక్ష్మీ మాట్లాడుతూ సముద్ర వ్యర్థాల పరిశుభ్రత పద్ధతులపై మాట్లాడారు. డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి కంపెనీలకు చెందిన హెచ్‌వోడీలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు పలు అంశాలపై చర్చించారు.

వీజేఎఫ్ ఎన్నికల నిర్వహణపై కసరత్తు

సాక్షి, విశాఖపట్నం : వీజేఎఫ్ ఎన్నికలకు అనువైన తేదీలు, సభ్యత్వ రుసుము, ఎన్నికల నిర్వహణ, సంబంధిత అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్టు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ప్రస్తుత వీజేఎఫ్ కార్యవర్గం కోర్టు కేసులు, సభ్యత్వం, ఎన్నికలు, బైలా తదితర విషయాలను ఐదుగురి అధికారులతో కూడిన కమిటీ చర్చించిందన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా పూర్తయ్యేంత వరకు జర్నలిస్టులు కూడా తమ పూర్తి సహకారాన్ని అందించాలని సూచించారు. ఎవర్నీ కించ పరిచేలా ప్రచారాలు చెయ్యడం సరికాదని ఆర్డీవో హితవు పలికారు. వైజాగ్ జర్నలిస్ట్ ఫోరంలో నెలకొన్న వివాదంపై కలెక్టర్ నియమించిన ఫైవ్ మెన్ కమిటీ గురువారం ప్రత్యేకంగా సమావేశమైంది. గత 12 ఏళ్లలో వీజేఎఫ్‌లో జరిగిన కార్యకలాపాలపై వస్తున్న ఆరోపణల్లో నిజానిజాలను నిగ్గు తేల్చేపనిలో పడింది. వీజేఎఫ్‌లో అక్రమాలు జరిగాయంటూ కొంతమంది కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ దీనిపై విచారణ కోసం ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ, జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా సహకార శాఖ అధికారి, ఈస్ట్ ఏసీపీతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం నుంచి ఆర్డీవో కార్యాలయంలో విచారణ ప్రారంభించింది.

బేగం.. నాట్యంలో అమేయం



కూచిపూడి ప్రదర్శన ఇస్తున్న బేగం

కళారాధన కులమతాలకు అతీమని షేక్ కాలేషా బేగం రుజువు చేస్తున్నారు. కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టిపెరిగినందున అక్కడి కళాక్షేత్రం మువ్వల సవ్వడికి ఆకర్షితులై, కూచిపూడిపై మక్కువతో కాళ్లకు గజ్జెకట్టేలా చేసింది. బురఖామాటున ఉండాల్సిన ఆడపిల్లకు ఇవేం డాన్స్‌లు అంటూ, ఇరుగుపొరుగు వేలెత్తి చూపినా.. తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. వెంపటి సత్యం మాస్టారి శిష్యరికంలో కూచిపూడి నృత్యంలో అందెవేసిన చేయిగా దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిగా పనిచేస్తూ.. తనబాటలో మరింత మంది నడిచేలా ప్రోత్సహిస్తున్నారు.

- అదరహో అనిపించేలా కూచిపూడి నృత్యం
- ముస్లిం అయినా, తెలుగు వ్యాఖ్యాతగా రాణింపు
- కేజీబీవీల ప్రత్యేకాధికారిణిగా మెరుగైన ఫలితాలు

విశాఖ విద్య : డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ కొలువు దక్కించుకున్న బేగం, భర్త విశాఖవాసి కావడంతో కృష్ణా జిల్లా నుంచి బదిలీపై విశాఖ వచ్చి, నగరంలోని పెదవాల్తేరు ఏరియాలో స్థిరపడ్డారు. ప్రస్తుతం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విశాఖ జిల్లా ప్రత్యేకాధికారిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల కేజీబీవీల్లో విశాఖ ప్రథమ స్థానం దక్కించుకోవటం ఆమె సమర్థతకు ఓ 'మెచ్చు'తునకగా చెప్పుకోవచ్చు. గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ బాల్య వివాహాల నియంత్రణకు పాటుపడుతున్నారు.

విద్యార్థినుల్లో కళానైపుణ్యం వెలికితీసేలా..

విద్యార్థినులను వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించేలా కాలేషా బేగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చంద్రంపాలెం హైస్కూల్లో పనిచేసిన సమయంలో ఇద్దరు విద్యార్థినులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో లిమ్కా బుక్ రికార్డు సొంతం చేసుకునేలా తర్ఫీదునిచ్చారు. ఇలా ఇప్పటి వరకు 70 మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. కేజీబీవీ జిల్లా ప్రత్యేకాధికారిణిగా తరచూ విద్యాలయాలను సందర్శిస్తూ విద్యార్థినుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తున్నారు. ఉన్నతాధికారుల సహకారంతో భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని కేజీబీవీల్లో డాన్స్ టీచర్‌ను ఏర్పాటు చేసేలా సమగ్ర శిక్ష వార్షిక బడ్జెట్(2023–24)లో ప్రతిపాదనలు చేశారు. ఆమె తర్ఫీదుతోనే ఏటా కలెక్టరేట్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ, రిపబ్లిక్ డే వేడుకల్లో కేజీబీవీ విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

వాఖ్యాతగా రాణింపు

తెలుగులో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యంతో ఎస్సీఈఆర్టీలో కొంతకాలం శిక్షకురాలుగా ఆమె పనిచేశారు. ఎస్సీఈఆర్టీ ద్వారా విద్యాశాఖ కార్యక్రమాలపై తీసిన డాక్యుమెంటరీలకు బేగం వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంగ్లిష్ బోధనపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన డాక్యుమెంటరీలో కాలేషా బేగం చేసిన వ్యాఖ్యానానికి ఉన్నతాధికారులు సైతం ఫిదా అయ్యారు. విద్యాశాఖ రూపొందించిన 64 వీడియోలకు వాయిస్ ఓవర్ ఇచ్చారు. భర్త ఏర్పాటు చేసిన 'మౌలనా అబుల్ కలాం అజాద్ ట్రస్ట్'ద్వారా నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల శిక్షణ ఇస్తుండటంతో పాటు, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందిస్తున్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ టీమ్‌లో పనిచేసినందున సమాజసేవలోనూ ముందుంటున్నారు.

అందరి సహకారంతో..



నేర్చుకున్న విద్యను పదిమందికీ పంచినపుడే దానికి సార్థకత అని తల్లిదండ్రులు చెప్పిన మాటలు ప్రేరణ కలిగించాయి. ఉపాధ్యాయ వృత్తి ఇందుకు ఎంతో దోహద పడింది. విద్యార్థుల అభ్యున్నతికి పనిచేసేలా భర్త ఖాజా రహమతుల్లా ప్రోత్సాహం ఎంతో ఉంది. ఉన్నతాధికారులు నాపై చూపుతున్న నమ్మకాన్ని మరింత పెంచుకునేలా అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్నాను. – కాలేషా బేగం

మాలమహానాడు రాష్ట్ర మహిళాధ్యక్షురాలిగా మల్లేశ్వరి

సీతంపేట: మాలమహానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ మంచ నాగమల్లేశ్వరిని నియమించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ హోప్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి మహిళలంతా ఉన్నత స్థానంలో ఉండాలని కృషి చేస్తున్న మంచ నాగమల్లేశ్వరి సేవలను గుర్తించి మాల మహానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించినట్టు తెలిపారు. ఇక నుంచి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాగమల్లేశ్వరి మాల మహానాడు ద్వారా పోరాటం చేస్తారన్నారు. నాగమల్లేశ్వరి మాట్లాడుతూ నా సేవలను గుర్తించి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహానాడు రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరి నన్నేటి నాగరాజు, వెస్ట్ గోదావరి జనరల్ సెక్రటరి కోలాటి ప్రసాదరావు, ఎన్‌సీఆర్‌సీ రాష్ట్ర జాయింట్ సెక్రటరి అంబళ్ల సురేష్, మాలమహానాడు సభ్యులు, న్యూ హోప్ సభ్యులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న నాగమల్లేశ్వరి

టీఎస్ ఎంసెట్‌లో నగర విద్యార్థుల హవా

విశాఖ విద్య: తెలంగాణ రాష్ట్ర ఎంసెట్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు సత్తా చాటినట్టు విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కేవీ రమణ వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎస్. అనిరుథ్ (స్టేట్ ఫస్ట్ ర్యాంకు) ,బీ. సంజన (8వ ర్యాంకు), ప్రశాంతి శ్రీజ (10), డీ. సాకేత్ నాయుడు (14), వీ. శ్రీకర్ నిహాల్ (40) డీ. ధనుష్ సాయి (47), ఎం.అవినాష్ కుమార్ (55), ఇ. కార్తీక్(81), కె. శ్రీకార్తీక్ (86), ఎన్ సిద్ధార్థ (89), డీ. పార్థ సారథి (93) వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. అదే విధంగా పదిలోపు 3, వంద లోపు 11, ఐదు వందల లోపు 52, వెయ్యి లోపు 78 మంది విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. మెడికల్ విభాగంలో వి. సంతోషిణి (20) ఆర్. తరుణ్ కుమార్(46), ఎస్. అనిష్ కుమార్ (74,) జి. నిషితాంజలి (84), కె. నిషిత ఆత్రేయ (95) వంటి అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. అదే విధంగా వందలోపు 4,ఐదు వందల లోపు 28, వెయ్యి లోపు 46 మంది విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించి విద్యా సంస్థల ఘనతను చాటారన్నారు.

'నారాయణ' ప్రతిభ

సీతమ్మధార: విశాఖ నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు టీఎస్ ఎంసెట్‌లో సత్తాచాటినట్టు డీజీఎం హనుమంతురావు, డీన్ జి. రామలింగేశ్వరరావు తెలిపారు. పీలా తేజశ్రీ (35), ఎంవీవీ హర్షవర్ధన్ (72), కె. లోక్ నాథ్ అభిషేక్(88) ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

తేజశ్రీకి 35వ ర్యాంకు



అనకాపల్లికి చెందిన పీలా తేజశ్రీ టీఎస్ ఎంసెట్ ఎంట్రన్స్‌లో 35వ ర్యాంకు కైవసం చేసుకుంది. నగరంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన ఆమె జేఈఈ ఓపెన్ కేటగిరిలో 225, ఓబీసీ కేటగిరిలో 41 ర్యాంకు సాధించింది. తేజశ్రీ తండ్రి పీలా వెంకట అప్పారావు గాజువాకలోని విశాఖ డెయిరీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా తల్లి సుజాత గృహిణి. కుమార్తె మంచి ర్యాంకు సాధించటంపై ఆనందం వ్యక్తం చేశారు. ఐఐటీ ముంబైలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావాలనేది లక్ష్యమని తేజశ్రీ తెలిపింది.

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ డివిజన్)
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్థు, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530 020.
ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com ఫోన్: 0891 - 2957044

ఒ.ఎ.నెం.427/2013 లోగల ఆర్.పి.నెం.180/2014
ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, సిరిపురం, విశాఖపట్నం
వెర్సస్
శ్రీ చంద్రమౌళి పాణిగ్రహి మరియు ఇతరులు
విషయం : ఇ-వేలం అమ్మకం వాయిదా వేయుట గురించి

[illegible] ది.13-04-2023 తేది నాటి సేల్ ప్రొక్లమేషన్/ ఇ-వేలం అమ్మకం నోటీసు ప్రకారం వెబ్‌సైట్ : https://www.bankeauctions.com లో ది.29-05-2022 ఉదయం 11.00 గం.లకు జరగవలసిన ఇ-వేలం షెడ్యూలు ప్రాపర్టీస్ ది.29-05-2022 తేదీ నుండి ది.17-06-2023 తేదీకి వాయిదా వేయడమైనది. మరియు ఆన్‌లైన్ బిడ్స్ సమర్పించుటకు ఆఖరితేది : 15-06-2023. [illegible] ది.16-06-2023 లోగా పంపించవలెను. ది.13-04-2023 తేది నాటి సేల్ ప్రొక్లమేషన్/ ఇ-వేలం అమ్మకం నోటీసు ప్రకారం నియమనిబంధనలలో ఎటువంటి మార్పులేదు.
(ఈ ప్రకటన వివరములు ది.26-05-2023 తేదీన నా స్వహస్తాలతో మరియు సీల్‌తో విశాఖపట్నం ట్రిబ్యునల్‌వారి సమక్షములో ధృవీకరించబడినవి)
సం/- (బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు) రికవరీ ఆఫీసర్

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (బ్యాంకింగ్ డివిజన్)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్థు, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530 020,
ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com ఫోన్: 0891 - 2957045

ఒ.ఎ.నెం.63/2016లోగల ఆర్.పి.నెం.356/2017 మరియు ఒ.ఎ.నెం.64/2016లోగల ఆర్.పి.నెం.548/2017
ఒ.ఎ.నెం.63/2016లోగల ఆర్.పి.నెం.356/2017
Between : ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి
And : శ్రీమతి పత్తికాయల సునీత & ఇతరులు
ఒ.ఎ.నెం.64/2016లోగల ఆర్.పి.నెం.548/2017
Between : ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి
And : శ్రీ బత్తిన ఎస్ఎస్ మల్లేశ్వరరావు & ఇతరులు
విషయం : ఇ-వేలం అమ్మకం వాయిదా వేయుట గురించి

యావన్మంది సంబంధిత ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఒ.ఎ. నెం.63/2016లో ఆర్.పి. నెం.356/2017 మరియు ఒ.ఎ. నెం.64/2016లో ఆర్.పి. నెం.548/2017 లోని ఆన్‌లైన్ ఇ-వేలం ది.13.04.2023 తేది నాటి సేల్ ప్రొక్లమేషన్/ ఇ-వేలం అమ్మకం నోటీసు ప్రకారం వెబ్‌సైట్ : https://www.bankeauctions.com లో ది.29.05.2023 ఉదయం 11.00 గం.లకు జరగవలసిన ఇ-వేలం షెడ్యూలు ప్రాపర్టీస్ ది.29.05.2023 తేదీ నుండి ది.17.06.2023 తేదీకి వాయిదా వేయడమైనది. మరియు ఆన్‌లైన్ బిడ్స్ సమర్పించుటకు ఆఖరితేది : 15.06.2023. సదరు సంబంధిత డాక్యుమెంట్ల సెల్ఫ్ అటెస్టెడ్ నకళ్ళతో పూర్తిచేసిన బిడ్‌ఫారం హార్డ్ కాపీతో కూడా ఈ క్రింది సంతకందారునికి ది.16.06.2023 లోగా పంపించవలెను. ది.13.04.2023 తేది నాటి సేల్ ప్రొక్లమేషన్/ ఇ-వేలం అమ్మకం నోటీసు ప్రకారం నియమనిబంధనలలో ఎటువంటి మార్పులేదు.
(ఈ ప్రకటన వివరములు ది.25-05-2023 తేదీన నా స్వహస్తాలతో మరియు సీల్‌తో విశాఖపట్నం ట్రిబ్యునల్‌వారి సమక్షములో ధృవీకరించబడినవి)
సం/- (బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె.బంగార్రాజు) రికవరీ ఆఫీసర్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
విశాఖపట్నం మెయిన్ బ్రాంచ్
డి నెం.30-15-58, 1వ అంతస్తు, సిల్వర్ విల్లో, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020. ఫోన్: 0891-2564496, 2563155, మొబైల్ నెం: 9137532890. ఇ-మెయిల్ ఐడి: ubin0532894@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

[illegible] https://www.mstcecommerce.com [illegible]

1)	[illegible]	[illegible]
2)	[illegible]	[illegible]
3)	[illegible]	26.06.2023, సా॥ 4.00 గం.ల లోపు
4)	[illegible]	27.06.2023, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు [illegible] www.mstcecommerce.com
5)	[illegible]	రూ. 80,00,000/- [illegible]
6)	[illegible]	రూ. 8,00,000/- [illegible]

1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ www.mstcecommerce ద్వారా నిర్వహించబడును.
2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp దర్శించండి మరియు బయ్యర్ గైడ్ ఫర్ లాగిన్ & రిజిస్ట్రేషన్ దయచేసి క్లిక్ చేయండి.
3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లో రూలు 8 (6) / రూల్ 9(1) / రూల్ 6(2) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన [illegible]
తేది: 20.05.2023, స్థలం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీస్, డోర్ నెం.51-1-2/1, ఎమ్.ఆర్.ఒ. ఆఫీసు ఎదురుగా, పాత ఈనాడు జంక్షన్, సీతమ్మధార, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530013. ఫోన్ నెంబర్: 0891-2546710, మొబైల్ నెంబర్: 8527672972, ఇ-మెయిల్ ఐడి: cmcrldrovisakhapatnam@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

[illegible] "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 27.06.2023న విక్రయించబడుతుందని [illegible]

ఇ-వేలం తేది & సమయం: 27.06.2023, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సొమ్మును సమర్పించుటకు ఆఖరి తేది: 26.06.2023, సా॥ 4.00 గం.ల లోపు

పెందుర్తి బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2719535, 9704471649

1. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): శ్రీమతి మానెల్లి లక్ష్మీ కుమారి, డి.నెం. 2-22-10, మింది, విశాఖపట్నం-530002 మరియు శ్రీ మానెల్లి గురుప్రసాద్, డి.నెం. 2-22-10, మింది, విశాఖపట్నం-530002. బకాయి మొత్తం: రూ. 21,18,549.78 పై. [illegible] + తేది.01.11.2022 నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు
(గాజువాక జాయింట్ ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 5975/1987 ప్రకారం శ్రీమతి మానెల్లి లక్ష్మీ కుమారి పేరున గల ఆస్తి). [illegible]
రిజర్వు ధర: రూ. 71,55,000/- ధరావత్తు: రూ. 7,15,500/- బిడ్ పెంపుదల: రూ. 10,000/-

మద్దిలపాలెం బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2522363, 9884297744

2. [illegible]
రిజర్వు ధర: రూ. 36,00,000/- ధరావత్తు: రూ. 3,60,000/- బిడ్ పెంపుదల: రూ. 10,000/-

అక్కయ్యపాలెం బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2546820, 8106777351

3. [illegible]
రిజర్వు ధర: రూ. 54,71,000/- ధరావత్తు: రూ. 5,47,100/- బిడ్ పెంపుదల: రూ. 10,000/-

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2546811, 8688621107

4. [illegible]
రిజర్వు ధర: రూ. 18,00,000/- ధరావత్తు: రూ. 1,80,000/- బిడ్ పెంపుదల: రూ. 10,000/-

పోతిన మల్లయ్య పాలెం బ్రాంచ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2556733, 9861321432

5. [illegible]
రిజర్వు ధర: రూ. 29,40,000/- ధరావత్తు: రూ. 2,94,000/- బిడ్ పెంపుదల: రూ. 10,000/-

1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ www.mstcecommerce ద్వారా నిర్వహించబడును.
2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp దర్శించండి మరియు బయ్యర్ గైడ్ ఫర్ లాగిన్ & రిజిస్ట్రేషన్ దయచేసి క్లిక్ చేయండి.
3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లో రూలు 8 (6) / రూల్ 9(1) / రూల్ 6(2) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన [illegible]
తేది: 20.05.2023, స్థలం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా